క్లుప్తంగా

29, 30 తేదీల్లో రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్



పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు ఈ నెల 29, 30 తేదీల్లో కేఎల్ యూనివర్సిటీలో జరుగుతాయని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ శనివారం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి ఏడు ప్రాజెక్టులతో ఈ పోటీల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు జాతీయస్థాయికి ఎంపికవ్వడానికి లాగ్ బుక్ ప్రాజెక్టు ఎలా డెవలప్ చేయాలనే అంశం పై శనివారం పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులలకు హుస్సేన్ ట్రైనింగ్ క్లాసులు నిర్వహించారు. విద్యార్థులు ప్రయోగాల్లో నూతన ఆలోచనలు ఉండే విధంగా ప్రజెంటేషన్ వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు ప్రొఫెసర్లు ఆన్‌లైన్లో సూచనలు సలహాలు ఇచ్చారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 29వ తేదీ ఉదయం 8గంటలకు హాజరుకావాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేద ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. నియోజకవర్గంలో నలుగురికి మంజూరైన రూ. 3.08 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు అందజేశారు. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, 104 వాహనాల ద్వారా ప్రతి గడపకూ అత్యాధునిక వైద్యం అందుతోందని ఆయన పేర్కొన్నారు. కార్పొరేటర్లు ఉద్దంటి సునీత, కొంగితల లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఆర్‌లో రాజ్యాంగ దినోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ దేవరకొండ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం శనివారం జరిగింది. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక సభ్యుడు రవీంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాగ్యలక్ష్మితో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు రాజ్యాంగ దినోత్సవం ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులతో రాజ్యాంగ ప్రవేశికను చదివించి ప్రతిజ్ఞ చేయించారు.

స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాగ్యలక్ష్మి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి స్త్రీల హక్కులు, వాటిని ఏ విధంగా పరిరక్షించుకోవాలో తెలియజేశారు. నేడు స్త్రీలు అనేక సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. విద్య అత్యంత శక్తివంతమైనదని విద్యార్థినులు హక్కులపై అవగాహన పెంచుకోవడంతో పాటు వాటిని పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రిస్మస్ నెల ప్రారంభ వేడుకలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ వీవీనరసరాజు రోడ్డులోని ఇమ్మానుయేల్ చర్చిలో క్రిస్మస్ నెల వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెవరెండ్ డాక్టర్ కనపర్తి ప్రభాకర్ యేసుక్రీస్తు సందేశంను వివరించారు. అలాగే క్రిస్మస్ గురించి విశ్వాసకులకు తెలియజేశారు. నెల రోజుల పాటు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇమ్మానుయేల్ చర్చిని విద్యుద్దీపాలతో అలంకరించి స్టార్‌ను ఏర్పాటు చేశారు.

అమర గాయకులకు స్వర నీరాజనం

విజయవాడ కల్చరల్: డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో కార్తికమాసం సందర్భంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికలో శనివారం నిర్వహించిన భక్తి గీతాలు, తెలుగు, హిందీ సినీ గీతాల కార్యక్రమం ఆకట్టుకుంది. చావా నరసింహారావు ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సత్యవర్ధన్, వాసిరెడ్డి శ్రీనివాస్, సాయిబాబు, సుధారాణి, వడ్డాది కామేశ్వరి, రూపాశ్రీ శివభక్తి గీతాలతో పాటు కార్తిక మాసం, కార్తిక పౌర్ణమి వెన్నెల జాబిల్లి చందమామ అంశాలకు ప్రాధాన్యతనిస్తూ సినీ గీతాలను ఆలపించారు. డ్రీమ్ ఆడియో అధినేత నరసింహరావు మాట్లాడుతూ ప్రతీ నెల విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఘంటసాల, బాలమురళీకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం లాంటి గాయకులు అరుదుగా కనిపిస్తారని పేర్కొన్నారు.

సెంట్రల్‌ను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అభివృద్ధిలో సెంట్రల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 59వ డివిజన్ అజిత్‌సింగ్‌నగర్‌లో రూ. 1.37 కోట్ల విలువైన రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజతో పాటు రూ. 11.36 లక్షలతో నిర్మించిన నూతన శానిటరీ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజా, స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానాతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డివిజన్‌లో రూ. 5.98 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గంగానమ్మగుడి నుంచి రైల్వేట్రాక్ వరకు ఉన్న కోలా నాగభూషణం రోడ్డులో రూ. 88.95 లక్షల బీటీ రోడ్డు నిర్మాణంతో పాటు నిత్యం రద్దీగా ఉండే రైతుబజార్ నుంచి ఆర్‌యూబీ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.48.80 లక్షల నిధులతో నేడు భూమిపూజ నిర్వహించినట్లు వెల్లడించారు. అలాగే నూతనంగా నిర్మించి ప్రారంభించుకున్న శానిటరీ కార్యాలయం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మరోవైపు నాడు–నేడులో భాగంగా స్థానిక ఎం.కె.బేగ్ ప్రభుత్వ పాఠశాలలో రూ.3 కోట్ల నిధులతో చేపట్టిన 20 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని, ఇదే ప్రాంతంలో మహిళా జూనియర్ కళాశాలను తీసుకురాగా.. 10 తరగతి గదులు కూడా మంజూరైనట్లు చెప్పారు. ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో ప్రతి ఒక్క వార్డు సచివాలయ పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా దాదాపు రూ. 20 కోట్ల నిధులు ఖర్చు చేశామని, 59వ డివిజన్‌లో మొత్తంగా రూ. 100 కోట్ల సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలియజేశారు. సెంట్రల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు ప్రజలందరూ రానున్న ఎన్నికల్లో అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో డీఈ(ఇంజనీరింగ్)గురునాథం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వందనం బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు నందెపు సురేష్, ఎండీ హాఫీజుల్లా, దేవిరెడ్డి రమేష్‌రెడ్డి, నేరెళ్ల శివప్రసాద్, చింతా శ్రీను, కృష్ణ, శాంతకుమారి, కొండా జయలక్ష్మి, షేక్ అమిత్, షేక్ వెంకట్, గెల్లిపోగు రాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దు

హాకర్లతో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసరావు



చెక్క పనులు చేసుకునే వారికి అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని ఏసీపీ శ్రీనివాసరావు హాకర్లకు చెప్పారు. త్రీ ట్రాఫిక్ పోలీసులు శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి హాకర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ డీవీ రమణ సిబ్బందితో కలసి కేదారేశ్వరపేట రైతుబజారు, ఏలూరు లాకుల సమీపంలోని చెక్క పనులు చేసుకునే వారిని, తోపుడు బండ్లు నిర్వహిస్తున్న వారితో మాట్లాడారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యాపారాలు చేసుకోవాల్సిందిగా అవగాహన కల్పించారు. ఏసీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో త్రీ ట్రాఫిక్ ఎస్‌ఐలు సీహెచ్ నాగదుర్గ, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక మాసోత్సవాలు



మధురానగర్(విజయవాడ సెంట్రల్): కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు శనివారం జరిగాయి. స్వామివారికి విశేషంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం బిల్వార్చన చేశారు. స్వామివారికి పంచహారతులు అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు దీపారాధనలు చేశారు.

పసుపుతోటలో.....

పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో కార్తిక మాసోత్సవాల్లో భాగంగా అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ జరిగింది. శ్రీసాయి నక్షత్ర మాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం, స్వామివారికి విశేషంగా పూజలు అభిషేకాలు జరిగాయి.

ఆర్‌యూబీని అందుబాటులోకి తీసుకురావాలి

రైల్వే అండర్ బ్రిడ్జి పరిశీలన



మధురానగర్ ఆర్‌యూబీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): రైల్వే అండర్ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్ తెలిపారు. మధురానగర్‌లో శనివారం నగరపాలక సంస్థ ఆధ్వర్యాన జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్ మాట్లాడుతూ రూ.15 కోట్ల వ్యయ అంచనాతో నిర్మిస్తున్న రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జ్ ప్రాజెక్టు పనుల్లో దాదాపు రూ.6.5 కోట్లతో రిటైనింగ్ వాల్, కనెక్టింగ్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొంతవరకు పూర్తవ్వగా ఇంకా రూ.8.5 కోట్లతో మిగిలిన నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉందని కమిషనర్ అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా రాకపోకలకు సులువుగా ఉండేటట్టుగా రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించామని పేర్కొన్నారు. అనంతరం ఆయన 26, 1వ డివిజన్, ఏలూరు రోడ్లో పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలించి ఫుట్‌పాత్‌లపై అనధికార ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. డ్రెయిన్లలో సిల్టును ఎప్పటికప్పుడు తీయాలని దీనిపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు.

10న బ్రాహ్మణ సేవా సంఘం వన సమారాధన

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 10వ తేదీ కార్తిక వన సమారాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు కొప్పవరపు వెంకట బలరామకృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సేవా సంఘం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలతో పాటు, బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికలు, కార్తిక మాసంలో వన సమారాధన ఏటా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది పోరంకి, రామాపురం కాలనీలోని కరణంగారి తోటలో నిర్వహిస్తున్నామని వివరించారు. దీనిలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, నీరాజన, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా సత్యనారాయణపురంలోని శృంగేరి పాదుకా క్షేత్రంలోని తమ కార్యాలయంలోగానీ, 9848148258 నంబర్‌లోగానీ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

లింగ వివక్ష మహిళాభివృద్ధికి ఆటంకం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): లింగ వివక్ష మహిళాభివృద్ధికి ఆటంకమని, చట్టాలను అమలు చేయడం ఎంత ముఖ్యమో సమాజంలో మార్పు రావడంకూడా అంతే ముఖ్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. మహిళలపై జరుగుతున్న హింసను నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో 'జెండర్ ఆధారిత హింస'కు వ్యతిరేకంగా శనివారం గొల్లపూడి సచివాలయం నుంచి మహిళలతో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ స్త్రీ పురుషుల మధ్య వివక్ష లేని నాడు నాగరికతతో కూడిన ఉత్తమ సమాజం ఏర్పడుతుందన్నారు. అటువంటి సమాజం ఏర్పాటులో ప్రతి ఒక్కరూ భాగస్వాములమవుదామని ప్రతిన బూనాలన్నారు. ఇప్పటికీ కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, వాటిని నిరోధించేందుకు సమాఖ్య సభ్యులు నిరంతరం ఆయా గ్రామాల్లో మహిళల స్థితిగతులను పర్యవేక్షించాలన్నారు. బాలికల్లో అక్షరాస్యత శాతం పెంచడం ద్వారా స్త్రీ, పురుషల మధ్య సమానత్వం సాధించడం సులభతరమవుతుందని కలెక్టర్ ఢిల్లీరావు పేర్కొన్నారు.

భాగస్వామ్యమవుతామని ప్రతిజ్ఞ

ఈ సందర్భంగా కూతురు, కొడుకు అనే తారతమ్యం లేకుండా వారికి సమాన హక్కులు కల్పిస్తామని, బాల్య, బలవంతపు వివాహాలు, గృహ హింసను వ్యతిరేకిస్తామని, చట్టాలను వినియోగించుకునేలా శాంతి, సంఘీభావ సందేశాలను వ్యాప్తి చేస్తామని స్త్రీ, పురుషులతో కలెక్టర్ ఢిల్లీరావు ప్రతిజ్ఞ చేయించారు. అందులో భాగంగా జరిగే కార్యక్రమాల్లో భాగస్వాములమవుతామని ప్రతిజ్ఞలో పేర్కొన్నారు. డీఆర్‌డీఏ పీడీ కె శ్రీనివాసరావు, డ్వామా పీడీ జె.సునీత, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, జిల్లా వ్యవసాయ అధికారిణి ఎస్.నాగమణెమ్మ, ఏపీఎం చంద్రశేఖర్, రూరల్ మండల ఎంపీడీఓ బి.భార్గవి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కె.సీత, కార్యదర్శి కె.రాణి, ఐసీడీఎస్ సీడీపీఓలు మంగమ్మ, కె నాగమణి, జిల్లా సమాఖ్య సభ్యులు, స్వయం సహాయక బృందాల మహిళలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యరూపకం

విజయవాడ కల్చరల్: ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం(అకాడమీ సాంస్కృతిక సంస్థ) ఆధ్వర్యాన నెల వారీ కార్యక్రమంలో భాగంగా మొగల్రాజపురంలోని అకాడమీ కళావేదికపై శనివారం హైదరాబాద్‌కు చెందిన యామిని రెడ్డి బృందం ప్రదర్శించిన త్రిపాది గంగ నృత్యరూపకం గంగానది స్త్రీతత్వాన్ని చాటింది. కథా కథనం, నృత్య దర్శకత్వం పసుమర్తి రామలింగ శాస్త్రి, ఎస్.యామినీరెడ్డి, నరసింగరావు, అరుణ వాసు, సుష్మ, సుస్మిత, దీపిక, సౌజన్య, శ్వేత, చైతన్య ప్రవంతి తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు కళాకారులను ఆత్మీయంగా సత్కరించారు.

చిట్టీల పేరుతో మోసగించిన మహిళకు మూడేళ్ల జైలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): చిట్టీల పేరుతో స్థానికుల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన కేసులో నిందితురాలికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ ఎనిమిదో అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు జడ్జి డి.లక్ష్మి శనివారం తీర్పు చెప్పారు. పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన నస్రీన్ అలియాస్ హేమలతారెడ్డి(37) చిట్టీలు వేసి స్థానికుల నుంచి డబ్బులు వసూలు చేసేది. మొదట్లో చిట్టీ పూర్తయిన వారికి సకాలంలో డబ్బులు చెల్లించడంతో ఆమెపై నమ్మకంతో మరింత మంది చిట్టీలు వేశారు. ఆ తరువాత నుంచి చిట్టీలు పూర్తయినా డబ్బులు ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి 2014, ఏప్రిల్ 31న బాధితులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి నిందితురాలిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. 16 మంది సాక్షులను విచారించి, నిందితురాలిపై నేరం రుజువు కావటంతో మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ జడ్జి తీర్పుచెప్పారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బావాజీపేట రెండో లైనులో రాధాకృష్ణ శేషు శిష్య బృందం ఆధ్వర్యాన కరణం తిరుపతి సహకారంతో అయ్యప్ప పూజా కార్యక్రమం శనివారం జరిగింది. నామాల గురుస్వామి స్వామివారికి ప్రత్యేక పూజలు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, అయ్యప్పలు, భవానీలు, శివయ్యలు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

• ఆట పాటలతో సందడి



నగరంలో బస్‌స్టాండ్ సమీపంలో ఉన్న రాజీవ్‌గాంధీ పార్కు శనివారం చిన్నారులతో కళకళలాడింది. పలు పాఠశాలల నుంచి చిన్నారులను పార్కుకు తీసుకు రావడంతో వారు ఆటపాటలతో సందడి చేస్తున్న దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



హోంగార్డుకు ఆర్థిక సాయం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఇటీవల పదవీ విరమణ పొందిన హోంగార్డు కుటుంబానికి డీసీపీ మోకా సత్తిబాబు రూ. 5లక్షల చెక్కును కమిషనరేట్ కార్యాలయంలో శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నగరంలో పనిచేస్తున్న హోంగార్డులు ఎవరైనా మరణించినా లేదా పదవీ విరమణ పొందినా వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదని నగరంలోని హోంగార్డులు తమ వేతనం నుంచి కొంత ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగానే ఈ నెల 5న పదవీ విరమణ పొందిన నాతం సూర్యనారాయణకు తోటి హోంగార్డులు అందించిన ఆర్థిక సాయాన్ని డీసీపీ చేతుల మీదుగా అందించారు.

మధురంగా సాగిన యువ సంగీత సమ్మేళనం

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మమణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో పవిత్ర కార్తిక మాసం సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో శనివారం నిర్వహించిన యువ సంగీత సమ్మేళనం మధురంగా సాగింది. యువ సంగీత కళాకారిణి మనసిజ కేబీఎస్ కృష్ణ వయోలిన్‌పై సంగీత సద్గురువులు త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి కీర్తనలు వాతాపిగణపతింను మధురంగా పలికించారు. ప్రారంభంలో డి.ప్రజ్ఞ వీణపై పలు సంప్రదాయ కీర్తనలను పలికించారు. వీణ విద్వాంసురాలు చివుకుల సుశీలాగోపాల్‌ను నిర్వాహకులు సత్కరించారు. సంగీత అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఏపీ ఒక మోడల్ స్టేట్‌గా మారిందని, అన్ని రంగాల్లో మన రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ 240వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ సహకారంతో గత నాలుగున్నరేళ్లలో ఈ సచివాలయ పరిధిలో రూ.6 కోట్ల విలువైన అభివృద్ధి పనులను పూర్తి చేశామని వెల్లడించారు. వీటిలో రూ. 5.17 కోట్ల నిధులతో తమ్మిన దుర్గారావు నగర్, గ్రీన్‌స్ట్రీట్ ఏరియా, షణ్ముఖసాయి నగర్, సన్ సిటీకాలనీ మెయిన్ రోడ్డు, న్యూఆర్‌ఆర్ పేట వెళ్లే ప్రధాన రహదారి, భరతమాత మందిరం మెయిన్ రోడ్డు సహా డివిజన్‌లో 36 రోడ్లను నిర్మించుకున్నట్లు వివరించారు. అలాగే 6.50 కి.మీ. మేర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి లైన్లను వేసినట్లు చెప్పారు. భరతమాత కాలనీలోనూ యూజీడీ, వాటర్‌లైన్ల పనులు ఇప్పటికే పూర్తికాగా ప్రతి ఇంటికీ కనెక్షన్లు ఇవ్వాలని అధికారులకు సూచించారు.

ప్రతిపక్షాలకు ఎందుకంత అక్కసు..?

జగనన్న సీఎం అయిన తర్వాత దేశంలోని అన్ని రాష్ట్రాలను ఆకర్షించేలా సుపరిపాలన అందిస్తున్నారని మల్లాది విష్ణు అన్నారు. అది చూసి ఓర్వలేక టీడీపీ, బీజేపీ, జనసేన రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను మసకబార్చే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నడిపిస్తున్నట్లు పురంధేశ్వరి మాట్లాడటం విడ్డూరంగా ఉందని చెప్పారు. మరోవైపు ఫిషింగ్ హార్బర్ ప్రమాదాన్ని పవన్‌కళ్యాణ్ రాజకీయం చేయడం సిగ్గుచేటని, ఎక్కడ, ఏం జరిగినా రాష్ట్ర ప్రభుత్వానికి ఆపాదించడం సరికాదన్నారు. ప్రమాదం జరిగిన మూడు రోజుల్లోనే మత్స్యకారులకు అండగా నిలబడి, దాదాపు రూ.7.5 కోట్లు సాయం అందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. 49 మంది పడవల యజమానులు, వాటిపై ఆధారపడిన మరో 450 మందికి కూడా ఆర్థిక సాయం చేస్తే.. దానిని కూడా రాజకీయం చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, వరప్రసాద్, సతీష్, వెంకట్, తోట వెంకటేశ్వరరావు, అంజిరెడ్డి, తోపుల వరలక్ష్మి, శోభన్, మహేశ్వరి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి

కలెక్టర్ ఢిల్లీరావు



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అర్హులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. 2024, జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారందరూ కొత్తగా ఓటు పొందడానికి వీలుగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–24 కార్యకలాపాలపై కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్న నేపథ్యంలో ఫాం–6, 7, 8లను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలన్నారు. ఇప్పటి వరకు అధికారులు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. 18–19 ఏళ్ల కేటగిరీకి సంబంధించి ఇప్పటివరకు 17,483 మంది నమోదు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన అర్హులకు అవగాహన కలిగించి, ఓటు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ప్రచారం చేయాలన్నారు. దీనికి నోడల్ అధికారులు క్షేత్ర స్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహిస్తుండటంతో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు. క్లెయిమ్స్, అభ్యంతరాలను డిసెంబర్ 26 నాటికి పూర్తిస్థాయిలో పరిష్కరించి, జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రదర్శనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఢిల్లీరావు సూచించారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, సబ్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం

- దేవినేని అవినాష్
- 100 ఇస్త్రీ పెట్టెల పంపిణీ



ఇస్త్రీ పెట్టెలు అందుకున్న రజకులతో దేవినేని అవినాష్

పటమట(విజయవాడతూర్పు): నగరంలో విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో అవసరమైన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి, దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దేవినేని అవినాష్ చెప్పారు. 14వ డివిజన్ చిన్న వంతెన సెంటర్ వద్ద శనివారం రజకులకు ఇస్త్రీ పెట్టెల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, రజక కార్పొరేషన్ చైర్మన్ రంగన్నతో కలిసి పాల్గొన్న అవినాష్ 100 మంది రజకులకు జీవనోపాధి నిమిత్తం ఇస్త్రీ పెట్టెలను, 15వ డివిజన్‌కు చెందిన వికలాంగునికి ట్రై సైకిల్ ను ట్రస్ట్ ద్వారా ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ఇంతమంది రజక సోదరులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని, ట్రస్ట్ ద్వారా నగరంలో ఐదేళ్లుగా విస్తృతంగా సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలో ఆర్వో మంచినీటి ప్లాంట్లు, పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, అవసరమైన వారికి ఫీజుల చెల్లింపు చేసి అండగా నిలిచామని, సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి సూచనలతో పేదలకు జీవనోపాధి నిమిత్తం తోపుడు బండ్లు, ఇస్త్రీ బండ్లు, బడ్డీ కొట్లు వితరణ చేస్తున్నామని పేర్కొన్నారు. వైద్య సాయం అవసరమైన వారికి ప్రభుత్వం ద్వారా సాయం అందేలా చూస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ యువ నాయకుడు దేవినేని అవినాష్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో అత్యంత సన్నిహితంగా మెలుగుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఆయన వల్లే ఇప్పుడు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ట్రస్ట్ ద్వారా చేపడుతున్న సామాజిక సేవ కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భట్రాజు కార్పొరేషన్ చైర్మన్ గీతాంజలి, పార్టీ నాయకులు కడియాల బుచ్చిబాబు, వీఎంసీ ఫ్లోర్ లీడర్ వి. సత్యనారాయణ, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొరివి చైతన్య, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేద్దాం

వీఎంసీ అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) సత్యవతి

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహానికి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం విజయంతం చేయటానికి అందరూ కృషి చేయాలని వీఎంసీ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి అన్నారు. వీఎంసీ ఆధ్వర్యాన శనివారం గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్‌లో ఆడుదాం ఆంధ్రపై వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర పోటీల్లో క్రికెట్, బ్యాడ్మింటన్ , వాలీబాల్ , ఖోఖో, కబడ్డీలో సచివాలయ స్థాయి, మండల స్థాయి, నియోజకవర్గస్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 27 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. విజేతలకు నియోజకవర్గ స్థాయి నుంచి నగదు బహుమతి, ట్రోఫీలు ఉంటాయని, పోటీల నిర్వహణకుప్రభుత్వం సచివాలయ స్థాయి నుంచి క్రీడా సామగ్రిని అందజేస్తామని తెలిపారు. ఈ పోటీల్లో వలంటీర్లు ముఖ్యపాత్ర పోషించాలని, స్థానికులకు అవగాహన కల్పించాలని పోటీలు పండుగ వాతావరణంలా కన్పించాలని సూచించారు. జిల్లా స్పోర్ట్స్– సీఈవో యు.శ్రీనివాసరావు, చీఫ్ కోచ్ అజీజ్ , సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, ఇందిరాగాంధీ స్టేడియం కోచ్‌లు పాల్గొన్నారు.